సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 29 । మార్చి । 2024



లక్ష్యం దిశగా అడుగులు

భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూలులో 91 శాతంతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది.

- 11లో



వనరులపై దృష్టి సారించాలి

ఇంధన వనరులపై దృష్టి సారించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

- 12లో



న్యూస్‌రీల్

టెన్త్ పరీక్షకు 9,257 మంది హాజరు

భువనగిరి : పదో తరగతి సామాన్య శాస్త్రం పేపర్‌–1 పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాల్లో 9,296 మంది విద్యార్థులకు గాను 9,257 మంది హాజరయ్యారు. 39 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు. మొత్తం 24 కేంద్రాల్లో డీఈఓతో పాటు స్క్వాడ్ బృందాలు, తహసీల్దార్లు, విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు.

ఓటరు అవగాహన ర్యాలీ



బీబీనగర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, మహిళా సంఘాల సభ్యులు

బీబీనగర్ : ఎన్నికల సంఘం చేపడుతున్న స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా బీబీనగర్ మండల కేంద్రంలో గురువారం వెలుగు అధికారులు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఓటు ఆవశ్యతను అధికారులు వివరించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, సీసీ శ్రీలత, వీఓఏలు పాల్గొన్నారు.

చదువుతోనే గౌరవం



మాట్లాడుతున్న జడ్జి మహతీవైష్ణవి

చౌటుప్పల్ : విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని, అమ్మాయిలు ఎన్ని కష్టాలు ఎదురైనా చదువును మధ్యలో ఆపేయవద్దని చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మహతీవైష్ణవి పేర్కొన్నారు. చౌటుప్పల్‌లోని తెలంగాణ బాలికల గురుకులం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ) పథకానికి ఎంపికైన గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి వ్యక్తికి చదువు భవిష్యత్‌ను ప్రసాదిస్తుందన్నారు. క్రమశిక్షణతో కూడిన చదువు సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెస్తుందన్నారు. అమ్మాయిలు ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.అలివేలు, ప్రిన్సిపాల్ కె.సరోజమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీరాం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ వరకు www.tswreis.ac.in లేదా tgtwgurukulam.telangana,gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి



చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎన్నికల సహాయ పరిశీలకుడు

చౌటుప్పల్ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా సహాయ ఎన్నికల పరిశీలకులు కె.సురేష్ తెలిపారు. చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం రాత్రి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఏమాత్రం ఏమరుపాటు వహించరాదన్నారు. తనిఖీలకు సంబంధించిన సమాచారం రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలని సూచించారు.

యాదాద్రీశుడికి శతఘటాభిషేకం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం స్వాతి నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున స్వయంభువులను కొలిచిన అర్చకులు.. ప్రధానాలయంలోని ముఖ మండపంలో కవచమూర్తులకు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. 108 బంగారు, వెండి కలశాలలో ఉన్న శుద్ధజలం, సుగంధ ద్రవ్యాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. వాటితో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకించారు. అంతకు ముందు హోమం నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు గిరిప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నిత్యపూజల కోలాహలం

ప్రధానాలయంలో నిత్యపూజల కోలాహలం నెలకొంది. వేకువజామున సుప్రభాత సేవ, స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఊరేగించారు.



స్వయంభూలకు అభిషేకం చేసేందుకు ప్రధాన కలశాన్ని తీసుకెళ్తున్న అర్చకులు



శ్రీస్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఏ జెండా ఎగిరేనో!

భువనగిరి ఎంపీ స్థానానికి తేలిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

- అసెంబ్లీ ఎన్నికల విజయంతో ఊపుమీదున్న కాంగ్రెస్
- మోదీ చరిష్మాను నమ్ముకున్న బీజేపీ
- ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్‌ఎస్ ఫోకస్
- సంప్రదాయ ఓటుపై సీపీఎం ఆశలు



సాక్షి, యాదాద్రి : భువనగిరి ఎంపీ స్థానానికి పోటీ చేసే ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. బీజేపీ నుంచి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ క్యామ మల్లేశ్, సీపీఎం నుంచి ఎండీ జహంగీర్ బరిలో నిలుస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయం, ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ఊపుమీద ఉండగా, బీజేపీ మోదీ చరిష్మాను నమ్ముకుంది. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్‌ఎస్ ఫోకస్ పెట్టింది. ఇక సీపీఎం సంప్రదాయ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకుంది. కాగా ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్యనే ఉండనుంది. గెలుపోటములపై ప్రజల్లో చర్చ మొదలైంది.

ఆరు సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. వాటిలో జనగామ మినహా మిగతా ఆరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. దీంతో కాంగ్రెస్ సులువేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి పార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఎంతవరకు లభిస్తుందోనన్న చర్చ కూడా జరుగుతుంది. అభ్యర్థి ఎంపిక విషయంలో కాంగ్రెస్ అధిష్టానం అభిప్రాయ సేకరణ చేయగా భువనగిరి, తుంగతుర్తి ఎమ్మెల్యేలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. ఆలేరు ఎమ్మెల్యే పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుపునకు కృషి చేస్తానని తన అభిప్రాయం వెల్లడించినట్లు సమాచారం. అలాగే బీజేపీ, బీఆర్‌ఎస్ బీసీలకు టికెట్లు ఇచ్చినందున కాంగ్రెస్ పార్టీ కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే టికెట్ ఇవ్వాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇక మాజీ ఎంపీ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన వైఖరిని ప్రకటించాల్సి ఉంది. జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలతో పరిచయాలు ఉన్న చామలకు క్షేత్ర స్థాయిలో క్యాడర్‌తో సంబంధాలు తక్కువగా ఉన్నాయి. సీఎం, జాతీయ స్థాయి నాయకత్వాన్ని మెప్పించి టికెట్ దక్కించుకున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, క్షేత్రస్థాయి నాయకత్వం మద్దతు కూడగట్టవలసి ఉంటుంది.

బీసీ ఓటు బ్యాంకుపై కమలనాథుల ఆశలు

బీజేపీ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ బూరనర్సయ్యగౌడ్‌ను ఆ పార్టీ అధిష్టానం రంగంలోకి దించింది. పార్లమెంట్ నియోజకవర్గంలో బీసీ ఓటర్లు ఎక్కువగా ఉండడంతో కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు. దీంతోపాటు మోదీ చరిష్మా, అయోధ్య రామమందిర నిర్మాణం, యువ ఓటర్లతో పాటు ఎంపీగా పనిచేసిన అనుభవం బీజేపీకి కలిసొస్తుందన్న చర్చ జరుగుతోంది. బీఆర్‌ఎస్ ఓట్లు కూడా బీజేపీకి క్రాస్ అవుతాయన్న నమ్మకంతో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

సంప్రదాయ ఓట్లు పోలయ్యేనా..

సీపీఎం ఈసారి ఒంటరిగానే బరిలోకి దిగింది. అభ్యర్థిగా జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పోటీ చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో కమ్యూనిస్టులు, మైనార్టీల ఓట్లు గణనీయంగానే ఉన్నాయి. సంప్రదాయ ఓట్లతో పాటు మైనార్టీ ఓట్లపై ఆ పార్టీ నమ్మకం పెట్టుకుంది.

గులాబీ పార్టీలో నాటి జోష్ ఏదీ?

బీఆర్‌ఎస్ పార్టీలో అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కన్పించిన జోష్ ఇప్పుడు లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, సీనియర్ నాయకులు పార్టీ వీడుతుండడం, కవిత అరెస్టుతో పార్టీలో కొంత స్తబ్దత నెలకొంది. సామాజిక సమీకరణల్లో భాగంగా బలమైన సామాజిక వర్గానికి చెందిన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన క్యామ మల్లేష్‌ను అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. అయితే ఆయన అభ్యర్థిత్వంపై పార్టీలోని ఓ వర్గం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ వైఫల్యాలు, కేడర్‌పైనే నమ్మకం

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జనగామలో మాత్రమే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉన్నారు. ఆరు సెగ్మెంట్లలో పార్టీకి ఎమ్మెల్యేలు లేరు.అయినా బలమైన కేడర్ ఉండడంతో విజయంపై పార్టీ నమ్మకం పెట్టుకుంది. మరోవైపు ప్రభుత్వ వైఫల్యాలే ఎజెండాగా ప్రచారానికి సిద్ధమవుతోంది.

న్యూట్రిషన్ కిట్‌లకు కటకట

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెల రోజులుగా కిట్‌ల కొరత
- పైనుంచి నిలిచిపోయిన సరఫరా
- ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువు
- గర్భిణుల ఎదురుచూపులు



జిల్లా కేంద్ర ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన గర్భిణులు

భువనగిరి : మాతా శిశు ఆరోగ్య కేంద్రంతో పాటు పీహెచ్‌సీలు, ప్రధాన ఆస్పత్రుల్లో న్యూట్రిషన్ కిట్‌ల కొరత ఏర్పడింది. నెల రోజులుగా పైనుంచి సరఫరా లేకపోవడంతో పంపిణీ నిలిచిపోయింది. దీంతో గర్భిణులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతోమంది గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. తద్వారా రక్తహీనత బారిన పడి మాతృ మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు హీమోగ్లోబిన్ శాతాన్ని పెంచేందుకు ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతో కూడిన న్యూట్రిషన్ కిట్ పథకాన్ని అప్పటి ప్రభుత్వం 2022 డిసెంబర్ 21న అందుబాటులోకి తీసుకువచ్చింది. తొలుత ఈ పథకాన్ని తొమ్మిది జిల్లాలో ప్రవేశపెట్టగా 2023 జూన్ 14న రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తీసుకువచ్చింది.

కిట్‌లో ఉండే వస్తువులు

న్యూట్రిషన్ కిట్‌ను రెండు విడతల్లో పంపిణీ చేస్తారు. మొదటి కిట్‌ను గర్భిణి ఐదు నెలల సమయంలో ఉండగా అందజేస్తారు. ఇందులో తొమ్మిది రకాల వస్తువులు ఉంటాయి. రెడో కిట్‌ను గర్భిణి తొమ్మిది నెలలుగా ఉన్నప్పుడు పంపిణీ చేస్తారు. ఇందులో పోను న్యూట్రిషన్ మిక్స్‌డ్ పౌడర్ (హార్లిక్స్), రెండు బాటిళ్ల (ఒక్కోటి కిలో చొప్పున), కిలో ఖర్జూరాలు, నెయ్యి 500 గ్రాములు, ఐరన్ సిరప్ 3 బాటిళ్లు, అల్బెండజోల్ ట్యాబెట్లు ఒక కప్పు, ప్లాస్టిక్ బుట్ట,వస్త్రపు సంచి, కప్పులు ఉన్నాయి.

కిట్‌లు వస్తలేవు

న్యూట్రిషన్ కిట్లు పైనుంచే వస్తలేవు. దీతో గర్భిణులకు కిట్ల పంపిణీ నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి సరఫరా జరిగితే వెంటనే పంపిణీ చేస్తాం.

–పరిపూర్ణాచారి, డీఎంహెచ్ఓ

నెల రోజులుగా కొరత



న్యూట్రిషన్ కిట్‌లో వస్తువులు

గర్భిణులకు నెలలను బట్టి రెండు విడతలుగా న్యూట్రిషన్ కిట్లు అందజేస్తారు. జిల్లాలో జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆయా ఆస్పత్రులకు గర్భిణులు చికిత్స కోసం వెళ్తుంటారు. ఈ క్రమంలో వారికి న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తారు. జిల్లాలో ప్రతి నెలా సుమారు 1000 కిట్ల వరకు పంపిణీ చేస్తుంటారు. కానీ, గత నెల రోజుల నుంచి కిట్ల పంపిణీ జరగడం లేదు. న్యూట్రిషన్ కిట్లతో ప్రయోజనం చేకూరుతుండడంతో నిరుపేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాలు ఆస్పత్రుల బాట పట్టడం పెరిగింది. కొంతకాలంగా కిట్‌ల పంపిణీ నిలిచిపోవడంతో గర్భిణులు నిరాశ చెందుతున్నారు.ఉన్నత అధికారులకు విన్నవిస్తున్నా స్పందన లేని బాధితులు చెబుతున్నారు.

ఓటు.. ప్రజాస్వామ్యానికి పునాది



మాట్లాడుతున్న కలెక్టర్, వేదికపై అదనపు కలెక్టర్లు, అధికారులు

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : ఓటుతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసుకునే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే కోరారు. ఓటింగ్ శాతం పెంపే లక్ష్యంగా స్వీప్ ఆధ్వర్యంలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఓటు ప్రాధాన్యతను వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారని, మే 13వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని కోరారు. ఓటు వేయడమే కాకుండా చుట్టుపక్కల వారికి కూడా ఓటు ప్రాధాన్యతను తెలియజేసి ఓటింగ్‌లో పాల్గొనేలా చూడాలని కోరారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, వీల్‌చైర్‌లు, వలంటీర్లను అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. 85 ఏళ్ల పైబడిన వారికి, దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. చూపులేని వారు ప్రిసైడింగ్ ఆఫీసర్లు ఫామ్‌–14ఆ ద్వారా సహాయకునితో ఓటు వేసేందుకు అవకాశం కల్పించనున్నట్లు వివరించారు.

ప్రలోభాలకు లోను కావద్దు

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్ మాట్లాడుతూ.. ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే వంద నిమిషాల్లోనే తగిన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా టోల్‌ఫ్రీ నంబర్ 1950కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదనపు కలెక్టరు గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటింగులో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఓ కృష్ణన్, మహిళా శిశు సంక్షేమ అధికారి చంద్రకళ, సీడీపీఓలు స్వరాజ్యం, శైలజ, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బబ్బూరి



భువనగిరి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

భువనగిరి క్రైం : జిల్లా కోర్టులో గురువారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.142 ఓట్లకు గాను 129ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా పోటీ చేసిన బబ్బూరి హరినాథ్‌గౌడ్ తన సమీప ప్రత్యర్థి గజ్జల రవీందర్‌రెడ్డిపై 34 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్షురాలిగా కలకుంట్ల జయ తన సమీప ప్రత్యర్థి దారెడ్డి జగన్‌మోహన్‌రెడ్డిపై నాలుగు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా కుక్కదూగ కృష్ణ, సహాయ కార్యదర్శిగా మట్ట వెంకటేశ్‌గౌడ్, సాంస్కృతిక కార్యదర్శిగా బొడ్డు కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిట్టా భాస్కర్‌రెడ్డి, సహాయ అధికారులుగా కృష్ణ, సిద్ధిరాములు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గోద వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాదులు గోరిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పులిమామిడి బాలకృష్ణారెడ్డి, వంచా దామోదర్‌రెడ్డి, శెట్టిగారి శ్రీకాంత్, కల్లూరి రవీందర్‌రెడ్డి, కుక్కదూగ సోమయ్య, కొలుపుల కమలాకర్, సూధగాని శంకర్ గౌడ్, సూధగాని రవి, డొంకెన హరిప్రియ, చందుపట్ల రజినీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఊరట

- పెరగనున్న దినసరి వేతనం
- ఏప్రిల్ 1నుంచి అమలు
- 2,61,571 మందికి లబ్ధి



రామన్నపేట : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీల దినసరి వేతనం ఏప్రిల్ 1నుంచి పెరగనుంది. ప్రస్తుతం కొలతల వారీగా రోజు రూ.272 చెల్లిస్తుండగా 1నుంచి రూ.28 పెంచనున్నారు. వేసవి భత్యం లేక అవస్థలు పడుతున్న కూలీలకు పెరగనున్న దినసరి కూలితో ఉపశమనం కలగనుంది.

జాబ్‌కార్డులు ఇలా..

జిల్లాలోని 17మండలాల్లో 1,41,399 కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. వాటిలో 2,61,571మంది కూలీలు నమోదై ఉన్నారు. 75,296 జాబ్ కార్డులకు సంబంధించి 1,05,064 కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 27, 322మంది కూలీలు హాజరవుతున్నారు. ఎండలు ముదరడంతోపాటు పని ప్రదేశాల్లో నీడ, మంచినీరు, మెడికల్‌కిట్‌లు లేకపోవడం, వేసవి అలవెన్స్ ఎత్తివేయడం వంటి కారణాలతో పనులకు వెళ్లడానికి కూలీలు ఆసక్తి చూపడం లేదు.

ఏటేటా పెరుగుతున్న వేతనాలు

గతంలో ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ చెల్లించేది. ఫిబ్రవరి, జూన్ నెలలో 20శాతం, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం అదనపు వేతనం చెల్లించేది.రెండేళ్లుగా కూలీలకు వేసవి అలవెన్స్ ఇవ్వడం లేదు. కానీ, ప్రతి ఏటా దినసరి వేతనం పెంచుతుంది. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో రూ.258, 2023–24 సంవత్సరంలో రూ.272లు చెల్లించింది. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్ 1నుంచి రూ.300 చెల్లించనుంది. పెరగనున్న వేతనాన్ని ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారికంగా ప్రకటించడం లేదు.

వేతనాల చెల్లింపులో ఆలస్యం?

సాఫ్ట్‌వేర్ మారిన తరువాత వేతనాల చెల్లింపులో ఆలస్యం జరుగుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జనవరి 17న వేతనాలు విడుదల చేసిన ప్రభుత్వం నెల రోజుల అనంతరం ఫిబ్రవరి 15న విడుదల చేసింది. ప్రస్తుతం 40రోజుల వేతనం పెండింగ్‌లో ఉంది. కొన్ని సందర్భాల్లో వేతనం విడుదలైనా పోస్టల్ అధికారులు జాప్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పథకం ప్రారంభంలో వారం రోజులకు ఒకసారి క్రమం తపపకుండా వేతనం చెల్లించేవారు. ప్రస్తుతం నెలలకొద్దీజాప్యం జరుగుతుంది.

పెంచిన వేతనం తక్కువే



నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. వాటితో పోలిస్తే ఉపాధి కూలీలకు పెంచిన వేతనం తక్కువే. కనీస వేతనం రోజుకు రూ.500 చెల్లించాలి. వేసవి అలవెన్స్ కూడా చెల్లించాలి. జాప్యం చేయకుండా సకాలంలో డబ్బులు చెల్లించాలి.

–సొప్పరి మహేశ్వరి ఉపాధికూలీ, జనంపల్లి

బీజేపీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

ఆలేరురూరల్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను దుర్వినియోగం చేస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. గురువారం ఆలేరులో విలేకరులతో మాట్లాడారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తుందని, ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై ఈడీ, సీబీని ప్రయోగిస్తుందన్నారు. కాంగ్రెస్ నేతల మాటలు, చేతల్లో నిజాయితీ, చిత్తశుద్ధి కనిపించడం లేదని విమర్శించారు. భువనగిరి ఎంపీ అభ్యర్థిగా ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొండమడుగు నర్సింహ నాయకులు బట్టుపల్లి అనురాధ, మంగ నర్సింహులు, ఎగ్బాల్, మొరిగాడి రమేష్, చెన్నరాజేష్, మల్లేషం పాల్గొన్నారు.

రామన్నపేట ఎంపీపీ రాజీనామా

- జెడ్పీ సీఈఓకు రాజీనామా లేఖ అందజేత
- సర్వసభ్య సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యులు అవమానించారని ఆవేదన



జెడ్పీ సీఈఓకు రాజీనామా లేఖ అందజేస్తున్న ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి

రామన్నపేట : రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి తన పదవికి రాజీనామా చేశారు. గురువారం జెడ్పీ సీఈఓ శోభారాణికి రాజీనామా లేఖ అందజేశారు. అనివార్య కారణాల వల్ల పదవికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.ఎంపీపీ రాజీనామాను సీఈఓ ఆమోదించారు. తదుపరి చర్యలు చేపట్టాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఈ సందర్భంగా జ్యోతి విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో రామన్నపేట మండల అభివృద్ధికి కృషి చేశానని, మింగుడు పడక అధికారపార్టీ నాయకులు తనపై అవిశ్వాసం ప్రకటించారని పేర్కొన్నారు. మహిళ అని చూడకుండా సర్వసభ సమావేశాల్లో అసభ్య పదజాలంతో మాట్లాడి అవహేళన చేశారని, భరించలేక పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు.తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

అవిశ్వాసానికి ముందే రాజీనామా

కాంగ్రెస్, సీపీఎంలకు చెందిన 10 మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ జనవరి 4న ఆర్డీఓకు నోటీసు అందజేశారు. ఈ క్రమంలో ఎంపీపీ కోర్టును ఆశ్రయించగా స్టే విధించింది. మార్చి 12న స్టేను రద్దు చేసింది. దీంతో అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించేందుకు ఈనెల 30న సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈనెల 14న సభ్యులకు ఆర్డీఓ నోటీసులు ఇచ్చారు. ముందే పదవికి రాజీనామా చేయడం, వెంటనే ఆమోదం పొందడం చర్చనీయాంశమైంది.

అవిశ్వాసం ఎదుర్కోలేకనే : ఎంపీటీసీ జ్యోతి

అవిశ్వాసం ఎదుర్కోలేక ముందుగానే ఎంపీపీ తన పదవికి రాజీనామా చేసి తమపై ఆరోపణలు చేస్తున్నారని దుబ్బాక ఎంపీటీసీ మదూరి జ్యోతి అన్నారు. సమావేశాల్లో ఎంపీపీ పట్ల దురుసుగా మాట్లాడి అవహేళన చేశారనే ఆరోపణలు అవాస్తవమన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నార్కట్‌పల్లి : మండలంలోని రైల్వే లైన్ పరిధిలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని నల్లగొండ రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి పరిధిలోని ×52 ×5-6 రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి మృతి చెందిన గుర్తు తెలియని సుమారుగా 70ఎళ్ల వయస్సు ఉన్న మృతదేహాంను సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులకు మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మెరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అల్లుడిని హత్యచేసిన మామ రిమాండ్

చింతపల్లి : అల్లుడిని బండరాయితో కొట్టి హత్య చేసిన మామను గురువారం చింతపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటంపేట గ్రామానికి చెందిన ఆలకుంట్ల రాజు(38) బండరాళ్లు కొట్టి గ్రామంలో జీవనం సాగిస్తున్నాడు. మామ అల్లుండ్లు బండల విషయంలో ఈనెల 23న తగాదా పడ్డారు. దీంతో వారు పెద్ద మనుషుల సమక్షంలో గ్రామంలో అదే రోజున రాత్రి మాట్లాడుకుంటుండగా ఒక్క సారిగా మామ సంపంగి ఎల్లయ్య అల్లుడు రాజుపై కట్టెతో దాడి చేశాడు. ఈ దాడిలో అల్లుడు రాజు తీవ్ర గాయం కావడంతో స్పృహకోల్పోయాడు. అదే విధంగా మామ పక్కనే ఉన్న బండరాయిని రాజు కాళ్లపై వేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎల్లయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. గురువారం మండలంలోని వెంకటంపేట వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఎల్లయ్యను మండల పోలీసులు పట్టుకున్నారు. అతడిని దేవరకొండ జడ్జి ఎదుట హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును చేధించడంలో కీలక పాత్ర పోషించి సిబ్బంది యాదయ్యను అభినందించారు.

మద్యం దుకాణంలో చోరీ



సీసీ కెమెరాలో నమోదైన నిందితుడి ఫొటో

మునగాల : ఓ మద్యం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు నగదును చోరీ చేశారు. ఈ ఘటన గురువారం మండలంలోని బరాఖత్‌గూడెంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని బరాఖత్‌గూడెంలో బుధవారం రాత్రి లక్ష్మి గణపతి వైన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు రూ.75వేల నగదును చోరీ చేశారు. రాత్రి సిబ్బంది దుకాణానికి తాళం ఇంటికి వెళ్లి గురువారం ఉదయం వచ్చి తాళం తీసి చూడగా నగదు ఉంచిన కౌంటర్ తెరిచిఉండడంతో అందులో పరిశీలించగా రూ.75వేలు చోరీ అయినట్లు గుర్తించారు. దుకాణం పైకప్పు రేకులను తొలగించి లోపలకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. దీంతో సిబ్బంది స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని చోరీ తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

బీబీనగర్ : ఉరివేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పంచముఖి వెంచర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామానికి చెందిన మిర్యాల నర్సింహ(26) వ్యక్తిగత కారణాలతో వెంచర్‌లో గల విద్యుత్ హైటెన్షన్ టవర్ వద్ద తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పు తీర్చమన్నందుకు హత్య..

- వీడిన పిచ్చమ్మ హత్యకేసు మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండక్రైం : ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని ఆమె దగ్గరే అప్పుతీసుకుని హత్య చేసి బావిలోపడేశారు దుండగులు. ఈ ఘటన ఇటీవల నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ హత్యకు సంబంధించిన వివరాలను గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామానికి చెందిన ముప్పిడి పిచ్చమ్మ(63)తో అదే గ్రామానికి చెందిన సిలువేరు లక్ష్మయ్య, చంద్రమోహన్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆమె నుంచి లక్ష్మయ్య రూ.1.50లక్షలు, నకిరెకంటి చంద్రమోహన్ రూ.లక్ష అప్పుగా తీసుకున్నారు. వారితో పాటు గ్రామానికి చెందిన నారబోయిన అంజయ్య కూడా రూ.40వేలు అప్పుగా తీసుకున్నాడు. అంజయ్య ఆమెకు అప్పు తిరిగి ఇచ్చినప్పటికీ ఇవ్వలేదని గ్రామపెద్దల సమక్షంలో ప్రమాణం చేయడంతో అంజయ్య మరలా పిచ్చమ్మకు రూ.40వేలు ఇచ్చాడు. అదే విధంగా పిచ్చమ్మ లక్ష్మయ్యను, చంద్రమోహన్‌ను కూడా డబ్బులు ఇవ్వాలంటూ పదేపదే అడుగుతుండడంతో లక్ష్మయ్య పిచ్చమ్మను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆమెను కలిసే చోటుకు రావాలని రాత్రి 9గంటలకు లక్ష్మయ్య ఫోన్ చేయడంతో సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో లక్ష్మయ్య చంద్రమోహన్, అంజయ్యలకు ఫోన్ చేసి రమ్మన్నాడు. వారు సంఘటనా స్థలానికి వచ్చి డబ్బుల విషయంలో ఎందుకు తమను ఇబ్బంది పెడుతున్నావు. నీతో కలిసే ఉంటున్నాం కదా అంటూ ముగ్గురు కలిసి కర్రతో ఆమె తలపై కొట్టి హత్య చేశారు. అనంతరం ఆమె మెడలో ఉన్న రెండు వరుసల పుస్తెల తాడు తీసుకున్నారు, అదేవిధంగా కాళ్ల కడియాలు తీసుకునేందుకు ప్రయత్నించగా అవి రాకపోవడంతో వదిలేశారు. హత్య అనంతరం ఆమెను ఈడ్పుకెళ్లి గ్రామ శివారులోని నకిరెకంటి అచ్చయ్యకు చెందిన బావిలో పడేశారు. మృతదేహం ఆనవాళ్లు లేకుండా, ఆధారాలు లేకుండా చేశారు. .

ఈనెల 21న మిస్సింగ్ కేసు..

ఈనెల 21న నుంచి పిచ్చమ్మ కనపడకపోవడంతో మృతురాలి సోదరుడు పందుల యాదయ్య నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు 24న విచారణ చేపట్టారు. ఆమెకు ఎవరితో సంబంధం ఉందనే వివరాలను ఆరా తీస్తూ ఫోన్ కాల్ డేటాను పరిశీలించారు. చివరి ఫోన్‌కాల్ ఆధారంగా పోలీసులు కూపి లాగడంతో నేరస్తులు ముగ్గురు ఒక దగ్గర రహస్య ప్రాంతంలో ఉండగా అరెస్టు చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేసిన సీఐ నాగరాజును, ఎస్‌ఐ అంతిరెడ్డి, ఏఎస్‌ఐ ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ రాము, మధు, శివ, గిరి, తిరుమలేష్‌ను డీఎస్పీ అభినందించారు. పిచ్చమ్మ గతంలో గ్రామ సర్పంచ్‌గా, ఆమె భర్త ఇస్తారి ఎంపీటీసీగా పనిచేశారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో ఈనెల 24న జరిగిన చైన్‌స్నాచింగ్‌కు సంబంధించిన కేసును పోలీసులు చేధించారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ పుష్పమ్మ(70) తన ఇంటి వద్ద కూర్చొని ఉండగా అదే సమయంలో ఆన్‌లైన్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేసే మండలంలోని దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన సిలివేరు ప్రవీణ్(30) అక్కడికి వెళ్లాడు. వృద్ధురాలితో మాటామాటా కలిపి మంచినీరు కావాలని అడిగాడు. వృద్ధురాలు ఇంట్లోకి వెళ్తుండగా వెనుక నుంచి వెళ్లి మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. వృద్ధురాలు కేకలు వేయగా అదే సమయంలో పక్కింటి మహిళ దాసోజు స్వప్న పట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ తప్పించుకున్నాడు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలో నిందితుడిని గుర్తించి గురువారం నిందితుడు దేవలమ్మనాగారం గ్రామంలోని తన ఇంటి వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు సీఐ తెలిపారు.

రూ.197.87కోట్లకు చేరుకున్న డిపాజిట్లు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ వెంకటబాలసుబ్రహ్మణ్యం

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డిపాజిట్లు రూ.197.87కోట్లకు చేరుకున్నట్లు బ్యాంకు చైర్మన్ కర్నాటి వెంకటబాలసుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని చేనేత టై అండ్ డై భవనంలో బ్యాంకు 48వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. అలాగే బ్యాంకు ఆర్థిక పరిస్థితి, వాయిదా మీరిన బాకీలపై నివేదిక చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బ్యాంకు ద్వారా ఇప్పటి వరకు రైతులు, వ్యాపారులు, ప్రజలకు రూ.109.71కోట్ల మేర రుణాలు ఇచ్చామన్నారు. బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్ మాట్లాడుతూ.. 9బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి ఖాతాదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన బత్తుల యాదమ్మ, కొండమడుగు శివ, పర్వతం మహేశ్ కుటుంబాలకు మంజూరైన రూ.లక్ష బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్‌చైర్మన్ సూరెపల్లి రమేశ్, డైరెక్టర్లు సీత దామోదర్, భోగ విజయ్‌కుమార్, చిక్క కృష్ణ, పున్న లక్ష్మీనారాయణ, కొండమడుగు ఎల్లస్వామి, కడవేరు కవిత, పిల్లలమర్రి అర్చన, రాపోలు వేణు, బిట్టు భాస్కర్, మాజీ చైర్మన్ కర్నాటి పాండు, టై అండ్‌డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, కర్నాటి బాలరాజు, బ్యాంకు మేనేజర్లు రాచకొండ మధుసూదన్, చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి జైలు

వలిగొండ : ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారకులైన నలుగురికి భువనగిరి అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి 3సంవత్సరాల జైలుతో పాటు రూ.500 జరిమానా విధించింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని చిత్తాపురం గ్రామంలో 2018లో భార్యను కాపురానికి పంపకుండా భార్య తల్లిదండ్రులు, భార్య తమ్ముడు పెడుతున్న వేధింపులను తట్టుకోలేక కారంపూడి ప్రసాద్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో డింగరి శేషాచార్యులు, డింగరి శ్రీదేవి, డింగరి ఫణికుమార్, కారంపూడి రోజను దోషులుగా తేల్చిన న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

చిలుకూరు : విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మండల పరిధిలోని పోలేనిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బత్తిని రేణుక (38) ఇంట్లోని విద్యుత్ మోటారు ఆన్‌చేయగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు భర్త తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

భువనగిరి క్రైం : ఓ మహిళ హత్య కేసులో నిందితుడికి భువనగిరి జిల్లా కోర్టు జడ్జి కే.మారుతీదేవి యావజ్జీవ శిక్ష విధించారు. వివరాల ప్రకారం.. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నందినగర్‌కు చెందిన చౌడబోయిన లక్ష్మి ఆమె భర్త మరణించడంతో కొంత కాలంగా తన ముగ్గురు పిల్లలతో కూలీ పనిచేస్తూ అక్కడే జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో లక్ష్మికి తన తల్లిగారి గ్రామమైన జనగాం జిల్లా దేవరుప్పల మండలం, ధర్మగడ్డతండా పెద్దముదురు కాలనీకి చెందిన ఆరె కుమార్ వెంకన్నతో పరిచయం ఏర్పడింది. దీంతో కుమార్‌వెంకన్న తరచూ హైదరాబాద్‌లోని లక్ష్మి ఇంటికి వచ్చివెళ్తుండేవాడు. దీంతో వారి ఇద్దరి మధ్య శారీరక సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో లక్ష్మి పలు కారణాలతో అతడిని వదిలించుకేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కుమార్ నవంబర్ 11, 2020న లక్ష్మి ఇంటికి వచ్చి నీతోమాట్లాడాలని చెప్పి బయటకు తీసుకెళ్లి భువనగిరి సమీపంలో హైదరాబాద్-వరంగల్ హైవే రోడ్డు పక్కన పొదల్లో గొంతు కోసి హత్య చేశాడు. దీంతో లక్ష్మి ఇంటికి రాకపోవడంతో అదేరోజు రాత్రి కూతురు చౌడబోయిన కీర్తన భువనగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అప్పట్లో పట్టణ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిందితుడు ఆరె కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా గురువారం ఒకటో అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కె.మారుతీదేవి అతడికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. నిందితుడు ఓసీసీ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



నరసింహ (ఫైల్)



సుమన్ (ఫైల్)

నల్లగొండక్రైం : ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నల్లగొండ వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలంలోని కాకుల కొండారం గ్రామానికి చెందిన కుడతాల నరసింహ (42) నలగొండ మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. నర్సింహ బుధవారం రాత్రి బైక్‌పై భార్య చంద్రకళతో కలిసి తన గ్రామానికి వెళ్తుండగా రాఘవేంద్ర బీఈడీ కళాశాల సమీపంలోకి వెళ్లగానే నల్లగొండకు చెందిన కార్తీక్ తన బైక్‌తో నల్లగొండ వైపు వస్తూ వారు ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో నరసింహకు రెండు చోట్ల కాళ్లు విరగ్గా, పొట్ట లోపలికి బైక్ హ్యాండిల్ చొచ్చుకుపోయి తీవ్ర రక్తస్రావం జరిగింది. భార్య చంద్రకళ రోడ్డుపై పడటంతో భుజం విరిగింది. గమనించిన వాహనదారులు గాయపడిన భార్యభర్తలను అంబులెన్స్‌లో నల్లగొండ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నరసింహ మృతి చెందాడు. భార్య ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వనం సుమన్(24) బుధవారం తన ద్విచక్రవాహనంపై పెళ్లికి హాజరై తిరిగి వస్తుండగా రెడ్డినాయక్‌తండా సమీపంలో రాగానే వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి పెదనాన్న కొడుకు వనం రమేష్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భువనగిరి ఎంపీ అభ్యర్థి చామలకు ఘన స్వాగతం

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ భువనగిరి అభ్యర్థిగా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా ఢిల్లీ నుంచి వచ్చిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి నాయకులు, అభిమానులు హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్టులో గురువారం ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రెండు రోజుల క్రితం ప్రకటించిన తెలంగాణలోని నాలుగు ఎంపీ స్థానాల్లో భువనగిరి స్థానం నుంచి మొదటి నుంచి అనుకున్న ప్రకారమే చామల కిరణ్‌కుమార్‌రెడ్డికే అధిష్టానం ప్రకటించింది.

యాదాద్రిలో ఐజీపీ రమేష్‌రెడ్డి పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహాస్వామిని రాష్ట్ర ఐజీపీ రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆయన కుటుంబ సభ్యులు గర్భాలయంలో స్వయంభూ ప్రతిష్టా అలంకార మూర్తులను దర్శించుకుని ముఖ మంటపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులవద్ద అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారిని దర్శించుకున్న రమేష్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు ఆలయ ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా ఈఓ భాస్కర్‌రావు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.



ఐజీపీ రమేష్‌రెడ్డికి లడ్డూ ప్రసాదం ఇస్తున్న ఈఓ భాస్కర్‌రావు